ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

- గ్రామాల్లో విద్యార్థుల ర్యాలీలు, మానవహారాలు, ప్రతిజ్ఞలు
- ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించిన అధికారులు

కమ్మర్‌పల్లిలో మానవహారం ఏర్పాటుచేసిన విద్యార్థులు, అధికారులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 25 : జిల్లావ్యాప్తంగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంతోపాటు వివిధ మండలాలు గ్రామాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. అధికారులు, స్థానిక నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీలు తీశారు. ప్రధాన కూడళ్ల వద్ద మానవహారాలు నిర్వహించి, ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

కోటగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మైనార్టీ కళాశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ తీసి, ప్రతిజ్ఞ చేశారు. పొతంగల్, రుద్రూర్‌లో తహసీల్దార్లు గంగాధర్, తారాబాయి ఆధ్వర్యంలో ర్యాలీలు తీసి, ప్రతిజ్ఞ చేసి అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. డిచ్‌పల్లిలో ఆర్డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్ ప్రభాకర్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించి, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ధర్పల్లిలోని డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జ్యోతి ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్ మాలతి విద్యార్థులతో ర్యాలీ తీసి, ప్రతిజ్ఞ చేయించారు. సిరికొండ మండలంలోని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ నర్సయ్య ఓటరు ప్రతిజ్ఞ చేయించి, అవగాహన కల్పించారు. చందూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో తహసీల్దార్ శాంత ర్యాలీ తీశారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో ఉత్తమ బీఎల్‌వోగా రుద్రూర్ మండలం చిక్కడ్‌పల్లి జీపీ కారోబార్ మచ్చురి అశోక్‌ను ఎంపిక చేశారు. ఆయనకు సబ్‌కలెక్టర్ కిరణ్మయి అవార్డును అందజేశారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. బోధన్‌లోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద పట్టణ సీఐ వెంకటనారాయణ, బీఎల్వోలతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామ అంగన్‌వాడీ సెంటర్‌లో ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఆర్మూర్‌లో మున్సిపల్ సిబ్బందితో కలిసి బల్దియా కమిషనర్ రాజు, తహసీల్దార్ గజానన్, ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి ర్యాలీ తీశారు. ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. మాక్లూర్ మండలం దాస్‌నగర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల(బాలికల) విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి ప్రిన్సిపాల్ స్వప్న ప్రశంసా పత్రాలను అందజేశారు. బాల్కొండలో కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ శ్రీధర్, ఆర్ఐ పి.గంగారాం, భరత్, పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్ తదితరులు పాల్గొన్నారు. భీమ్‌గల్‌లోని సబ్‌స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ తీశారు. బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటుచేశారు. ఎంపీడీవో సంతోష్, ఎస్సై మహేశ్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అశ్విన్ తదితరులు పాల్గొన్నారు. రెంజల్ తహసీల్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు అందరి బాధ్యత అన్నారు. కమ్మర్‌పల్లి మండలంలో అధికారులు ర్యాలీ తీసి మానవహారం నిర్మించారు. ఏర్గట్ల జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత మాట్లాడుతూ.. ఓటు వజ్రాయుధం అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఆర్ఐ సదానంద్, రెవెన్యూ అధికారులు కిరణ్, రాకేశ్, సతీశ్, వెంకటేశ్, నవత, హెచ్ఎం కృష్ణాచారి తదితరులు పాల్గొన్నారు. ముప్కాల్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యార్థులు, అధికారులు మానవ హారాలు నిర్మించారు. ఓటుపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సత్యశోధక్ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కోటగిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద..

డిచ్‌పల్లిలో 2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో రాజేంద్రకుమార్

రెంజల్ తహసీల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

భీమ్‌గల్‌లో విద్యార్థులు ఏర్పాటుచేసిన మానవహారం

చందూర్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ శాంత

మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా

ధర్నా చేస్తున్న రాష్ట్ర రైతు సంఘం నాయకులు

కంఠేశ్వర్/ ఖలీల్‌వాడి, జనవరి 25 : నగరంలోని గాంధీ గంజ్ మార్కెట్‌యార్డు ఎదుట రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు కంజర భూమయ్య మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటల ఉత్పత్తులకు సంబంధం లేని ఇతర వాణిజ్య వ్యాపారాలు వ్యవసాయ మార్కెట్, గాంధీ గంజ్‌లో నిర్వహిస్తూ.. రైతు ఉత్పత్తులు విక్రయిస్తున్న వారికి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ పాలకవర్గం స్పందించి రైతు ఉత్పత్తులు అమ్మే వారికే గాంధీగంజ్ మార్కెట్‌లో అవకాశం కల్పించాలని కోరారు.

రాంపూర్ చేపల చెరువుకు వేలం

కోటగిరి, జనవరి 25 : మండలంలోని రాంపూర్ గ్రామ సమీపంలోని బరకం చేపల చెరువుకు శనివారం వేలం వేశారు. పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తుల సమక్షంలో వేలం నిర్వహించగా.. రాంపూర్ గ్రామానికి చెందిన గుండ్ల గంగారాం రూ.3.43 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రుద్రూర్ సీఐ కృష్ణ, సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

టీయూ నూతన వెబ్‌సైట్ ఆవిష్కరణ

డిచ్‌పల్లి, జనవరి 25 : టీయూ నూతన వెబ్‌సైట్‌ను వర్సిటీ వీసీ ఆచార్య యాదగిరిరావు శనివారం ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న అధికారుల సమగ్ర వివరాలతో పాటు వర్సిటీ అందించేలా కోర్సులు, అనుబంధ కళాశాలలతోపాటు అన్ని వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు వీసీ తెలిపారు. కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్, వెబ్‌సైట్ అండ్ నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ అతీఖ్ సుల్తాన్ ఘోరీ, డాక్టర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

కోరట్‌పల్లి సబ్ స్టేషన్‌లో ఫీడర్ వీసీబీలు ప్రారంభం

ఫీడర్‌లను ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

డిచ్‌పల్లి, జనవరి 25 : మండలంలోని కోరట్‌పల్లి గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఫీడర్ వీసీబీలను ఎస్ఈ రవీందర్, డీఈ ఉత్తమ్ జాడేతో శనివారం ప్రారంభించారు. వీటి ద్వారా కోటార్‌పల్లి, సుద్దులం నాణ్యమైన విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ రాజేందర్, మాజీ ఉపసర్పంచ్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు వేముల పరామర్శ

నాగాపూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్/ భీమ్‌గల్, జనవరి 25 : వేల్పూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పలువురు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం పరామర్శించారు. బాధితులకు ధైర్యం చెప్పారు. భీమ్‌గల్ మండలంలోని నాగాపూర్‌కు చెందిన బసకొండ దేవేందర్, బాజాగౌడ్, నరేశ్, భీమ్‌గల్‌కు చెందిన నర్సయ్య కుటుంబాలను ఎమ్మెల్యే వేముల పరామర్శించారు. నర్సయ్య కుటుంబానికి రూ.పదివేల నగదును అందజేశారు. ఆయనవెంట బీఆర్ఎస్ భీమ్‌గల్ మండల అధ్యక్షుడు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

38వ నేషనల్ గేమ్స్ డీసీడీఎంగా ఈగ సంజీవ్‌రెడ్డి

కంఠేశ్వర్, జనవరి 25 : ఉత్తరాఖండ్‌లో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు నిర్వహించే నేషనల్‌గేమ్స్‌కు ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి డిప్యూటీ చీఫ్ డీ-మిషన్‌గా నియమితులయ్యారు. తెలంగాణ నుంచి ఇద్దరిని నియమించగా.. జిల్లాకు చెందిన ఈగ సంజీవ్‌రెడ్డి నియామకం కావడంపై అసోసియేషన్ చైర్మన్ ఆంద్యాల లింగన్న, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, క్రీడా సంఘాల బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కారు విడుదల

కారును ఆవిష్కరిస్తున్న ఏసీపీ రాజావెంకటరెడ్డి, షోరూం ప్రతినిధులు

ఖలీల్‌వాడి, జనవరి 25 : జిల్లాకేంద్రంలోని ప్రకాశ్ హ్యుందాయ్ షోరూంలో క్రెటాఎలక్ట్రిక్ కారును జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎల్.రాజావెంకటరెడ్డి శనివారం ఆవిష్కరించారు. షోరూం ఎండీ నల్ల ప్రవంతిరెడ్డి మాట్లాడుతూ.. ఒకసారి చార్జింగ్ చేస్తే 473 కిలోమీటర్లు మైలేజ్ ఇస్తుందని, బ్యాటరీ 10 నుంచి 80 శాతం వరకు 58 నిమిషాల్లో (50 కేడబ్ల్యూ), 39 నిమిషాల్లో (100 కేడబ్ల్యూ) చార్జింగ్ అవుతుందని తెలిపారు. అడ్వాన్స్ టెక్నాలజీతోపాటు, అని రకాల సౌకర్యాలతో కారును అందుబాటులోకి తీసుకువచ్చారని, కారు ప్రారంభ ధర రూ.17.99 లక్షల నుంచి రూ. 23.50 లక్షల వరకు ఉన్నదని తెలిపారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ వినోద్, నితిన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు తవ్వే కొంకిని పరిశీలిస్తున్న రైతులు

పసుపు తవ్వే కొంకి పరిశీలన

మోర్తాడ్, జనవరి 25: పసుపు తవ్వే కొంకిని పలువురు రైతులు శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. డాక్టర్ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు బి.మహేందర్, పి.శ్రీనివాస్ వారికి అవగాహన కల్పించారు. కొత్తగా తయారుచేసిన కొంకితో రైతులు తక్కువ శ్రమతో పసుపును తవ్వవచ్చని తెలిపారు. కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్‌పల్లి, మెట్‌పల్లి మండలాల్లో రైతులు ఈ పద్ధతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

సంగారెడ్డి తరలిన సీపీఎం నాయకులు

బోధన్ నుంచి తరలివెళ్తున్న నాయకులు

శక్కర్‌నగర్, జనవరి 25: సంగారెడ్డిలో నిర్వహించనున్న సీపీఎం నాలుగో రాష్ట్ర మహాసభలకు ఆ పార్టీ నాయకులు శనివారం బోధన్ నుంచి తరలివెళ్లారు. ఇందుకు సంబంధించిన వాహనాన్ని సీపీఎం జిల్లా నాయకుడు గంగాధరప్ప జెండా ఊపి ప్రారంభించారు. ఈనెల 28వ తేదీ వరకు పార్టీ మహాసభలు కొనసాగుతాయని తెలిపారు. సీపీఎం బోధన్ ఏరియా కార్యదర్శి ఏశాల గంగాధర్, ఏరియా కమిటీ సభ్యురాలు మీనా, నాయకులు సుంకరి పోశెట్టి, తోకల దత్తు, సాయిలు, ఎస్. గంగాధర్, ప్రభాస్, అనిత, గిరిజ, నాగనాథ్ తదితరులు మహాసభలకు తరలివెళ్లారు.

విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలి

విద్యార్థులతో సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా

ఆర్మూర్‌టౌన్, జనవరి 25: ప్రతి ఒక్కరూ సమాజ సేవలో ముందుండాలని సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా అన్నారు. మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆర్మూర్‌లోని కోర్టు భవనంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి బైండోవర్

ఆర్మూర్‌టౌన్, జనవరి 25: గంజాయికి బానిసైన ఇద్దరిని తహసీల్దార్ గజానన్ ఎదుట శనివారం బైండోవర్ చేసినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. గంజాయి వినియోగాన్ని అరికట్టడానికి 128బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేసి బైండోవర్ చేశామని చెప్పారు.

టై, బెల్టుల పంపిణీ

ముప్కాల్, జనవరి 25: మండలంలోని రెంజర్ల జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు టై, బెల్టులను రికుల రాజారెడ్డి శనివారం అందజేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా రూ.ఆరు వేల విలువ చేసే టై, బెల్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డికి ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపింది. హెచ్ఎం జక్కుల రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్తీ పాలతో క్యాన్సర్ ముప్పు

మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట, జనవరి 25: నవీపేట బస్టాండ్ ఆవరణలో ఇంటి దీపం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నిజామాబాద్ ఆర్డీవో రాజేందర్‌కుమార్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్తీ పాలతో క్యాన్సర్ ప్రమాదం పొంచి ఉన్నదన్నారు. ప్రజలు విజయ డెయిరీ పాలను వినియోగించాలని సూచించారు. రైతులు చెరుకు సాగుచేస్తే బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, ప్రసన్న, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై బి.రాము

ఏర్గట్ల, జనవరి 25: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఏర్గట్ల ఎస్సై బి.రాము అన్నారు. ఏర్గట్లలోని మార్కెట్ వద్ద శనివారం పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మట్, కారు నడిపే వారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. డయల్ 100, సైబర్ క్రైమ్‌కు సంబంధించిన 1930 ఫోన్ నంబర్ల గురించి వివరించారు. కళాబృందం సభ్యులు ఆటలు, పాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు నర్సయ్య, మన్నన్, సుమన్, నారాయణ, లింగారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శివయ్య, కానిస్టేబుళ్లు గంగాధర్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

మాక్లూర్, జనవరి 25: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా రాని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతోపాటు పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్కు జిరాక్స్ కాపీలను జతపరిచి స్థానిక ఏఈవోలకు అందజేయాలని తెలిపారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

పాఠశాలకు సామగ్రిని అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

భీమ్‌గల్, జనవరి 25: మండలంలోని బడా భీమ్‌గల్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 2001-02 బ్యాచ్ విద్యార్థులు పాఠశాలకు చేయూతను అందించారు. రూ.50వేల విలువ చేసే వంట సామగ్రి, టీవీ, బెంచీలను వితరణ చేశారు. వాటిని హెచ్ఎం కృష్ణస్వామికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుమన్, శంకర్, ప్రభాకర్, గంగారెడ్డి, నవీన్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కృష్ణకుమార్

శక్కర్‌నగర్, జనవరి 25: బోధన్ పట్టణానికి చెందిన బచ్చు కృష్ణ కుమార్ అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. రాకాసీపేట్‌లోని వైష్ణవి ఫైనాన్స్‌లో పనిచేసే ఆయన ఈనెల 24వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆయన కుమారుడు యోగేశ్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను తొలగించాలి

ఆర్మూర్‌టౌన్, జనవరి 25: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనలను తొలగించాలని ఇద్దరు పిల్లల నిబంధన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గాంధీనాయక్, ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి అన్నారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. 1995లో అమలులోకి తీసుకువచ్చిన ఇద్దరు పిల్లల నిబంధనను ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా తొలగించేలా చూడాలని కోరారు. ఎక్కువ మంది పిల్లలు ఉన్న వారు కూడా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఆర్మూర్ బల్దియా సాధారణ సమావేశం

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లావణ్య

ఆర్మూర్‌టౌన్, జనవరి 25: ఆర్మూర్ మున్సిపల్ సాధారణ సమావేశాన్ని చైర్‌పర్సన్ లావణ్య అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 36వార్డుల్లో ఉన్న సమస్యలపై చర్చించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చైర్‌పర్సన్ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PASSPORT LOST

★ I, SYEDA FATIMA SHEERAZ D/o. SYED ATEEBUDDIN SHEERAZ, H.No. 12-1-50/B/3, Sadaat Enclave, New Fruit Market, Arsapally, Nizamabad, T.G., I have lost my original Indian Passport bearing No.Y1666829 while going for xerox copy From Fruit Market to Natraj Talkies, Bodhan Road, Nizamabad on 10-01-2025, If anybody found please Call:9177505507
NTZ-7060

CHANGE OF NAME

★ I,YELDI MANJULA SUDARSHAN (Old Name) Residing at H.NO:1-1-47, Vinayak Nagar, Nizamabad, Telangana - 503001, hereby declare that I have Changed my name to ENUGANDULA POOJITHA (New Name) W/o. ENUGANDULA JAYASIMHA.
NTZ-338457

WANTED

★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివరించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ 4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

బోధన్ రూరల్, జనవరి 25: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఏస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సాలూరా మండలం హున్సా గ్రామానికి చెందిన సున్నపు ఒడ్డెన్న (54) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన అతడు శనివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య గంగవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దరఖాస్తు ఫారాలు జీపీల్లో అందుబాటులో ఉంచాలి

పొతంగల్, జనవరి 25 : ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయాల్సిన దరఖాస్తు ఫారాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా, రైతుభరోసా అర్హుల జాబితాను గ్రామసభల్లో అధికారులు చదివి వినిపించారు. అర్హులమైన తమ పేర్లు జాబితాలో లేవని పెద్ద సంఖ్యలో ప్రజలు అధికారులను నిలదీయగా.. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో జీపీల వద్ద దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు బారులు తీరారు. దరఖాస్తు చేసుకునేందుకు దరఖాస్తు ఫారాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని జిరాక్స్ షాపుల వారు ఒక్కో దరఖాస్తును రూ. 5 నుంచి రూ.10 వరకు విక్రయిస్తున్నారు. కొనుగోలు ఫారాలను జీపీల్లో ఉచితంగా అందజేయాలని బీఆర్ఎస్ మండల నాయకుడు నవీన్‌తోపాటు గ్రామస్తులు కోరుతున్నారు.

ఎల్ ఎల్ బీ రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

డిచ్‌పల్లి, జనవరి 25 : టీయూలో ఎల్ఎల్‌బీ పరీక్షల రీవాల్యుయేషన్‌కు నోటిఫికేషన్‌ను శనివారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారిణి ఆచార్య ఆరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ రెగ్యులర్/బ్యాక్‌లాగ్ థియరీ -జనవరి 2025 ఒక్కో పేపర్‌కు రూ.500, రివాల్యుయేషన్ ఫారానికి రూ.25 చెల్లించాల్సి ఉంటుందని, ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'పచ్చదనం పరిశుభ్రత'

చందూర్, జనవరి 25 : మండలకేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆవరణలో చెత్తా చెదారాన్ని ఏరివేసి, పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌కు రికార్డులు సిద్ధం చేయాలి

ధర్పల్లి, జనవరి 25 : గ్రామాల్లో ఉపాధిహామీ పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ కోసం రికార్డులను సిద్ధం చేయాలని ఎంపీడీవో బాల కృష్ణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో జీపీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి రికార్డుల తనిఖీకి సోషల్ ఆడిట్ వచ్చారని తెలిపారు. సమావేశంలో ఏపీవో వినోద,